imma

Eenadu

Transport Corporation of India

Date: 22-07-2010 | Edition: Hyderabad | Page: 8 | Source: Bureau | Clip size (cm): W: 23 H: 18

Clip: 1 of 1



# ఈ సదుపాయాలు ఏ మూలకు..!

☛ మన అవసరాలకు ఇంకా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాలి ☛ సరకు రవాణా రంగం కోలుకుంది

'న్యూస్‌టుడే' ఇంటర్వ్యూ

ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ అగర్వాల్

**దేశంలో మౌలిక సదుపాయాల రంగంపై ప్రభుత్వాలు ఇప్పుడు వెచ్చిస్తున్న నిధులు ఏ మూలకూ సరిపోవని, మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాలను ఇంకా ఎంతో పెద్ద ఎత్తున చేపట్టవలసిన అవసరం ఉందని ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (టీసీఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీత్ కుమార్ అగర్వాల్ అన్నారు. అదే సమయంలో నాణ్యత కూడా బాగా పెరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యాప్త ఆర్థిక మాంద్యం నుంచి భారత ఆర్థిక వ్యవస్థ త్వరగా కోలుకున్న నేపథ్యంలో లాజిస్టిక్స్ పరిశ్రమ మళ్లీ మెరుగైన వృద్ధి పథంలో సాగుతున్నట్లు వివరించారు. భవిష్యత్తు అవకాశాలకు అనుగుణంగా విస్తరణ దిశగా టీసీఐ ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. 'న్యూస్‌టుడే' ముఖాముఖీలో ఆయన ఇంకా ఏం చెప్పారంటే:**

**న్యూస్‌టుడే: ఆర్థిక మాంద్యం ప్రభావంతో ఎక్కువగా ఇబ్బంది పడేది సరకు రవాణా (లాజిస్టిక్స్) రంగమే. పరిస్థితి ఇప్పుడెలా ఉంది.. కాస్త కోలుకున్నట్లేనా?**

**వినీత్ అగర్వాల్:** ప్రస్తుతం బాగానే ఉంది. సాధారణంగా లాజిస్టిక్స్ రంగం వృద్ధి జీడీపీ మీద ఆధారపడి ఉంటుంది. జీడీపీకి ఒకటిన్నర రెట్ల వృద్ధి ఈ రంగంలో నమోదవుతుంది. గత కొంతకాలంగా మెరుగైన ఆర్థికాభివృద్ధి నమోదవుతున్నందున ఆ మేరకు సరకు రవాణా రంగం కూడా కోలుకుంది. ఆటోమొబైల్ రవాణా, ఇంజినీరింగ్ లాజిస్టిక్స్ విభాగాల్లో పరిస్థితి ఆశాజనకంగా ఉంది.

**న్యూ: దేశంలో ఇటీవల కాలంలో రహదార్ల హంగు పెరుగుతోంది. ఇది పరిశ్రమకు అనుకూలించేదే. దీన్ని మీరెలా చూస్తున్నారు?**

వాస్తవానికి మన అవసరాలకు ఈ సదుపాయాలు ఏమాత్రం సరిపోవు. ప్రభుత్వాలు మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చిస్తున్న నిధులు కూడా ఎంతో తక్కువ. మౌలిక సదుపాయాలు ఇంకా ఎన్నో రెట్లు పెరగాల్సిన అవసరం ఉంది. రహదార్లు, ఓడరేవులు, విమానాశ్రయాలను పెద్ద ఎత్తున నిర్మించాలి. వాస్తవానికి ఎన్నో ఏళ్ల క్రితం అవసరాలకు ఉండాల్సిన సదుపాయాలను ఇప్పుడు నిర్మిస్తున్నారు. అంతేగానీ ఇప్పటి అవసరాలకు, భవిష్యత్తు పరిస్థితులకు అనుగుణంగా సదుపాయాలను సమకూర్చుకుంటున్న పరిస్థితి మన దేశంలో లేదు. సదుపాయాల సంఖ్య మాత్రమే కాకుండా, నాణ్యతా ఎంతో ముఖ్యం. ఉదాహరణకు సరుకుతో ఒక లారీ దేశంలోని ఏదైనా ఒక నగరంలోకి ప్రవేశించాలంటే ఇప్పటికీ రెండు గంటల సమయం పడుతోంది. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి.

**న్యూ: ఈ మధ్యకాలంలో డీజిల్ రేట్లు పెరిగాయి. డీజిల్‌ను నియంత్రిత ధరల వస్తువుల జాబితా నుంచి తొలగించి, మార్కెట్ ధరను అమలు చేసే పద్ధతికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. సరకు రవాణా పరిశ్రమపై దీని ప్రభావం ఎలా ఉంది?**

పరిశ్రమకు దీనివల్ల వచ్చిన ఇబ్బందేమీ లేదు. అదనపు వ్యయాన్ని మేం భరించం. వినియోగదార్లకు బదలాయిస్తాం. అది వినియోగదార్లకు భారమవుతుంది.

**న్యూ: సరకు రవాణా రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం అధికం అవుతోంది. మీ అనుభవాలు ఏమిటి?**

వేగవంతంగా, సమర్థంగా సేవలు అందించడానికి వీలు కలుగుతోంది. టీసీఐలో మేం సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికంగా వినియోగిస్తున్నాం. జీపీఎస్ ట్రాకింగ్ ఇప్పటికే ఉంది. ఇంకా విస్తృత స్థాయిలో కంప్యూటర్ల వినియోగం అమలవుతోంది.

**న్యూ: భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా టీసీఐ ఎటువంటి విస్తరణ కార్యకలాపాలను చేపట్టబోతోంది?**

రూ.160 కోట్ల విస్తరణ ప్రణాళికకు గత బోర్డు సమావేశంలో టీసీఐ ఆమోద ముద్ర వేసింది. ఈ నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెచ్చించాలి. సరకు రవాణా వాహనాలను కొనుగోలు చేయడం, కొత్తగా మరొక ఓడను సమకూర్చుకోవడం, కంప్యూటర్ హార్డ్‌వేర్ కొనుగోలు, సరకు రవాణా కేంద్రాలు నెలకొల్పడం వంటి అవసరాలపై ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తాం. ఈ నిధులను అంతర్గత వనరుల ద్వారా కొంత, రుణ మార్గంలో మరికొంత సమకూర్చుకుంటాం. టీసీఐకి 6 సరకు రవాణా ఓడలు ఉన్నాయి. చెన్నై- పోర్ట్ బ్లెయిర్, విశాఖపట్టణం- పోర్ట్ బ్లెయిర్ తదితర మార్గాల్లో ఇవి తిరుగుతాయి. వీటికి అదనంగా మరొక ఓడను కొనుగోలు చేసే యత్నాల్లో ఉన్నాం.

**న్యూ: సంస్థ ఆదాయాలు ఏస్థాయిలో ఉన్నాయి. భవిష్యత్తు అంచనాలు ఏమైనా చెప్పగలరా?**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.394.19 కోట్ల నికర ఆదాయాన్ని, రూ.12.19 కోట్ల నికరలాభాన్ని నమోదు చేశాం. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఉన్న రూ.313.68 కోట్ల నికర ఆదాయం, రూ.7.90 కోట్ల నికర లాభంతో పోల్చి చూస్తే ఇపుడు వరుసగా 25.67 శాతం, 54.30 శాతం వృద్ధి కనిపిస్తున్నాయి. ఆటోమొబైల్, కేపిటల్ గూడ్స్, ఇంజినీరింగ్ విభాగాల నుంచి ఆదాయం అధికంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇదే స్థాయిలో వృద్ధి కొనసాగుతుందని భావిస్తున్నాం. పూర్తి సంవత్సరానికి నికర ఆదాయం రూ.20 శాతం వరకూ, నికరలాభం 30 శాతం వరకూ పెరిగే అవకాశం ఉంది.

– న్యూస్‌టుడే, హైదరాబాద్